నెల్లూరు
10-1-81

డియర్ లతిక !

"హౌ ఆర్ యూ ? బొత్తిగా ఉత్తరాల్లో కన్పించడం మానేశావ్! ఏం అని అడిగితే- విశేషాలేం లేవని తప్పించుకుంటావ్! ఏమేవ్! ఈసారినుంచి నేను వ్రాసే ఉత్తరానికి రిప్లై ఇవ్వకపోయావో నేనేం చేస్తానో తెల్సా?"

చెప్పేదా? భయపడకు- మీ పతిదేవులు వుంటే ఆయన్ని గట్టిగా కౌగలించుకుని మరీ చదువ్! చెప్పనా- నీకు, మీ శ్రీవారికి తగువుపెట్టి అమాంతం దూరం చేసేస్తా- టేక్ కేర్- అమ్మడూ! వెంటనే ఉత్తరం వ్రాయవే! వుంటాను

నీ రజని.

* * *

నెల్లూరు.
14-1-81

ఏమే లతికా !

నిన్నింకా డియర్ అని సంబోధించమంటావా? గాడిదా! సిగ్గులేకపోతే సరి! మొగుడి పక్కనచేరి కులుక్కపోతే ఓ కార్డుముక్క రాయరాదూ! ఛీఛీ! ఏం ఆడపిల్లలబ్బా! పెళ్ళయ్యేవరకే- ఆపైన ఇంతే సంగతులు.

ఈ లోకంలోనే వున్నావా? ఈ రోజు పండుగ! ఎలాగోలా తీరిక చేసుకుని నీకు ఉత్తరం వ్రాస్తున్నా! అమ్మ ఓ ప్రక్క కేకలేస్తున్నది. పని తెమలటంలేదని. సరే గానీ, వదో తేదీ వ్రాసిన ఉత్తరం ఈ పాటికి అందే వుంటుంది. త్వరగా రిప్లై ఇయ్యవే! బోర్‌గా వుంది! నా సంగతి తెలిసి కూడా ఎందుకే ఏడిపిస్తావ్?

ఇదిగో ఇదే చెప్తున్నా- వెంటనే ఓ నాలుగు రోజుల్లో- అహఁ కాదులే వారం రోజుల్లో రిప్లై రాకపోయిందో నేనే వెల్తా. బేడ సర్దుకుని మీ వూరొచ్చేస్తా- నాకెలాగూ వైజాగ్ చూడాలని ఎప్పటి నుంచో కోరిగ్గా వుంది!

నేనొచ్చాక మీవారిని ముంమ పుట్టింటికి పంపించి మనిద్దరం ఝూంమంటూ వూరంతా తిరగాలి!


ఏవిఁటే ఆముదం తాగినట్టు అలా ముఖం పెట్టావ్?

నీకి బాధలన్నీ తప్పాలంటే వెంటనే లెటర్ వ్రాయి! ఇప్పటికే బాగా హడలిపోయావు! వుండనా-

చెప్పింది చేస్తా!
రజని.

* * *

వైజాగ్,
4-1-81



మై డియర్ రజనీ!

కులాసాగా వున్నావా?

నేను సంతోషంగానే వున్నాను. మా వారి ముచ్చట్లు వ్రాయమని వ్రాశావు- నాకేం చేతనవునే-పెళ్ళయ్యిందన్నమాటే గానీ, నీకన్నా నాకు ఎక్కువ తెల్సా? పెళ్ళికి ముందు అన్నీ నువ్వేగా చెప్పావ్!

ఆఁ సరేగానీ సినిమాలేం చూశావే? ఇక్కడ 'జగదాంబ'లో మొన్న ఓ ఇంగ్లీషు సినిమా చూశాను. ఛీ! ఏవిఁటే యిలాంటి సినిమాలు ఎలా రిలీజవుతున్నాయో- అని అసహ్యం వేసిందనుకో.

ఆయన ప్రక్కన కూర్చుని చూడ్డానికి చచ్చే సిగ్గేసింది బాబూ! ఆ సినిమా గురించి అంతకంటే వివరంగా నీకు వ్రాయాలా?

ఇప్పటికే నీ ఎక్సరే బుర్రతో ఆ సినిమా నంతా నీ కళ్ళముందుకు లాక్కుని వచ్చి వుంటావు.

ఇంకేంటి విశేషాలు?

అన్ని వివరాలతో వచ్చే నీ ఉత్తరం కోసం ఎదురు చూస్తూ

లతిక.

* * *

నెల్లూరు.
15-1-81

డియర్ లతిక!

నువ్వు ప్రేమతో వ్రాసిన 4-1-81వ తేదీ ఉత్తరం నాకు ఈ రోజు- అంటే 15-1-81వ తేదీన చేరింది.

ఏవిఁటే ఆశ్చర్యం!

పోస్ట్ చేయటంగానీ ఆలస్యం చేశావా? రిప్లై వ్రాయి. రజని.

* * *

వైజాగ్.
20-1-81

రజనీ!

నీవు వ్రాసిన 10, 14, 15వ తేదీల ఉత్తరాలు అందాయి!

అంతి కోపమైతే ఎలానే!

ఈమధ్య మా ఇంట్లో కాస్త సందడిగా వుండి వెంటనే రిప్లై వ్రాయలేకపోయానే! సందడి అంటే వేరే అర్థాలు తీసేవుసుమా! మా అమ్మా వాళ్ళు వచ్చారు. అంతే.

తర్వాత 15-1-81వ తేదీ ఉత్తరంలో అలా వ్రాశావేంటే? నేను 4-1-81న వ్రాసి ఆ రోజే మా పని కుర్రాడిచేత మా వీధి చివర్నవున్న పోస్ట్ డబ్బాలో వేయించానే.

నీ ఉత్తరం వచ్చాక అనుమానం వచ్చి వాడ్ని అడిగాను కూడా. "లేదమ్మగారూ! ఏసినా!" అని వాడు చెప్పాడు.

నాకూ ఆశ్చర్యంగానే వుంది.

పోస్టల్ డిలే ఏమో?

మా అమ్మ వూరెళ్ళింది! పండక్కు-గాలేదని ఎంతగా నిష్ఠూర మాడిందను కున్నావ్! ఉగాదికి ఇప్పుడే పిలిచి వెళ్ళింది. మా మరిది ఇంటర్ కాలేజీ ఫస్ట్‌లో పాసయ్యాడు! వుంటాను. ఉత్తరం వ్రాయి.

నీ లతిక

* * *

నెల్లూరు,
28-1-81

డియర్ లతికా!

ఇరవయ్యో తేదీ వ్రాసిన సందడి ఉత్తరంఅందింది. మీమరిదికి కంగ్రాట్స్ చెప్పు నా తరఫున! ఇంకా బాగా చదవమను.

అయినా వైజాగ్ నుంచి పోస్ట్ రావటానికి కరెక్ట్‌గా రెండురోజులు పడుతుంది. కాస్త ఆలస్యమైతే మూడు. కానీఇదేవిటి? నాలుగున వ్రాస్తే పదిహేనున చేరటం?

పోస్టల్ డిపార్ట్‌మెంట్ వారికి ఈరోజే కంప్లయింట్ వ్రాసేస్తా!

నీ అభిప్రాయం వ్రాయి!

ఇద్దరిదీ కలిపి ఘాటుగా నాలుగు వడ్డిస్తా. వూరుకుంటే లాభంలేదు. వెంటనే వ్రాయవే!

రజనీ

* * *

వైజాగ్,
5-2-81

సత్యభామ రజనీ!

అదేవిటా అని ఆశ్చర్యంతో అవులిస్తున్నావా? లేకపోతే అంత కోపం ఎందుకే? అబ్బ! నీకు ఏది వచ్చినా పట్టలేంగా!

ఆ పోస్ట్ వాళ్ళమీద దండెత్తి, విజయం సాధిస్తావేం? వాళ్ళు మనం చెప్పింది ఈ చెవిన విని ఆ చెవిన వదిలేస్తారు.

ఎందుకొచ్చిన శ్రమ? వూరుకుందూ.

## కోలపల్లి ఈశ్వరరావు

"ప్రేమ సింహాసనం" నవల చదువుతున్నావా? యద్దనపూడిదే మొద్దూ. బావుంది చదువ్! సినిమాలేం చూశావ్?

పప్పన్నం ఎప్పుడు పెడతావే? ఎంత నాజూగ్గా వుంటేమాత్రం అలానే వుండిపోతావేం? వుంటాను!

లతిక

పి. యస్. : త్వరగా రిప్లై ఇవ్వు!

* * *

నెల్లూరు,
10-2-81

లతికా!

నీ నోరు మెలితిప్పేస్తానేవ్ !

నాకు అరికాలిమంట నెత్తికెక్కుతుంటే నీకు చీమ కుట్టినట్లయినా లేదూ?!

అవున్లే ఎందుకుంటుంది?

ఎక్కడ నీ బండారం బయటపడిపోతుందోనని భయం- అవునా?

రజని

* * *

వైజాగ్,
17-2-81

రజనీ!

నా బండారం ఏవిటే?

ఆ ఉత్తరంలోని సారాంశం నాకు అర్థం కాలేదు. సస్పెన్సుతో చంపక కాస్త వివరంగా వ్రాద్దూ. మావారు కూడా వూర్లో లేరు. బోర్‌గా వుంది.

పెద్ద ఉత్తరం వ్రాయవే! తీరిగ్గా చదువుకుంటాను. ఏదో తేదీ ఉత్తరం ఏవిటో వ్రాయి వుంటాను.

లతిక

* * *

నెల్లూరు,
22-2-82

మహానటి లతికా!

అవునే, నువ్వు తప్పకుండా సినిమాల్లో చేరచ్చు. సావిత్రి, వాణిశ్రీల్లా అసమాన నటివై పోతావ్.

వెంటనే ఓ ప్రొడ్యూసర్ని కల్సుకుని చేరిపో. లేకపోతే ఏవిటే? నా ఉత్తరం నీకు అర్థం కాలేదూ? నీ బండారం సంగతి తెలీదూ?


అయ్యో పాపం! పసికందు! నిజంగానే తెలీదా.

ఊఁ అలాగయితే వివరంగా వ్రాస్తాను. మైండ్ ఫ్రెష్ చేసుకుని మరీ చదువు. ఏమేవ్! ఈ లెటర్ చదివాక నీరసంతో డీలా పడిపోతావేమో. ఫ్లాస్కులో కాఫీ వున్నాయేమో చూసుకో.

ఊఁ వ్రాస్తున్నా!

బుజ్జీ నువ్వు నాకు 4-1-81న లెటర్ వ్రాశావు. నాకు చేరింది 15-1-81 అవును కదూ. అంతవరకూ బాగానే వుంది.

నేను ఎంక్వయిరీచేసి తేల్చుకున్న దేమిటంటే- నువ్ 13-1-81వ తేదీ నాకు



వుత్తరం వ్రాశావని. లెటర్‌ప్యాడ్‌లో మాత్రం 4-1-81 అని వ్రాశావని।

ఏం కంగారుగా వుందా?

నిజంకదూ?

ఎలా కనుక్కున్నానో వ్రాయమంటావా?

నువ్వు నాకు లెటరంతా వ్రాసేసి. కవర్ మీద అడ్రసు కూడా వ్రాసి, అంటించే ముందు లెటర్‌కు గమ్ అంటుకుంటుందేమోనని- లెటర్ను కప్పిపెడుతూ ఓ వేస్ట్ పేపర్ పెట్టాలనుకున్నావు।

పాపం।

నీకు సమయానికి ఏదీ దొరికినట్లు లేదు. టేబుల్ క్యాలండర్లో ముందు రోజుది- అంటే 12వ తేదీ స్లిప్పు చింపావు. కదా। అది క్రిందపడి వుంటే- ముందు వెనుక ఆలోచించక ఆ స్లిప్పును తీసి నా లెటరులో పెట్టావు।

నువ్వు నాలుగో తేదీ లెటర్ వ్రాసివుంటే 12వ తేదీ స్లిప్పు ఎక్కడిది చిట్టితల్లీ?!

అహ్హహ్హ।

ఈ రజనీ అంటే ఏమనుకున్నావ్-

పిచ్చిదానా— నన్నే బోల్తా కొట్టించాలని అనుకుంటున్నావేం?

భయపడక వెంటనే ఉత్తరం వ్రాయి.

నీ గుండెల్లో నిద్రపోయే
రజని

* * *

వైజాగ్.
27—2—81

జీనియస్ రజనీ-

ఏం బుర్రే నీది। అబ్బ। నువ్వు ఇండియాలో వుండవలసిన దానివి కాదుసుమా

ముందుగా నీ తెలివికి నా జోహార్లు।

ఏం చెయ్యనే చెప్పు? నేను ఉత్తరం వ్రాయటం లేదని కోప్పడతావేమోనని- తేదీ అలా మార్చివేశాను.

తప్పయిపోయిందె.

ఇంకెప్పుడూ ఇలా చెయ్యనుగా।

మన్నించవే సఖీ।

లెంపలేసుకుంటున్నాన్లేవే. కోప్పడక।

నా తప్పుకు శిక్షగా నువ్ వైజాగ్ వచ్చినపుడు మావారిని పుట్టింటికి పంపించి ఓ వారం రోజులు నీతోనే తిరుగుతానే।

పెద్ద ఉత్తరం వ్రాయి।

మరోసారి మన్నించమని కోరుతూ,

ఎప్పటికీ.

నీ లతిక.